క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో భీరన్న ఉత్సవాలు


విన్యాసాలు ప్రదర్శిస్తున్న కళాకారులు

తాండూర్: మండలంలోని ద్వారకాపూర్ గ్రామంలో భీరన్న పండుగ ఉత్సవాలు వా రం రోజుల నుంచి భక్తి శ్రద్ధలతో జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా బుధవారం నాగవెల్లి కార్యక్రమం నిర్వహించారు. యాదవులు భారీ ఎత్తున బోనాలతో వెళ్లి పూజలు చేశారు. ఉత్సవ వేడుకల్లో భాగంగా ఒగ్గు కథ, లింగాలు తీయడం, నాగవెల్లి కల్యాణం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్ర మం చేపట్టారు. కార్యక్రమంలో ఎల్లాకుల రవి కుమార్, హరికృష్ణ, చంద్రగిరి శ్రీనివాస్, ఎల్లాకుల సురేష్, వేల్పుల సురేష్, రాగులయ్య, శేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు మాదిగల ఆత్మీయ సమ్మేళనం

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని శ్రీ కృష్ణ ఫంక్షన్ హాల్లో ఆదిజాంభవ సంఘం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఏడు గంటలకు మాదిగల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు వాసాల శంకర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు బీడునూరి శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ హాజరవుతారని సకాలంలో మాదిగ కుల బాంధవులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి


ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

జన్నారం: రైతులు కష్టపడి పండించిన ధాన్యం వర్షంలో తడిసి, నష్టం జరగక ముందే కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు తాళ్లపెల్లి రాజేశ్వర్ అన్నారు. మండలంలోని పొనకల్‌లో మార్కెట్ యార్డులో తడిసిన వరి ధాన్యాన్ని బుధవారం పరిశీలించారు. తేమ శాతం పేరుతో ఆలస్యం చేయకుండా వెంటనే వరి ధాన్యాన్ని తూకం వేసి ఆదుకోవాలన్నారు. తడిసిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

పంట నష్టపరిహారం చెల్లించాలి


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

చెన్నూర్: మండలంలో అకాల వర్షానికి నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఎలాంటి షరతులు విధించకుండా నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ సాదనబోయిన కృష్ణ, వైస్ చైర్మన్ నవాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానికంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అకాల వర్షానికి మామిడి, వరి పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లిందన్నారు. చెన్నూర్ మండలంలోనే సుమారు రూ.50లక్షలకు పైగా నష్టం జరిగిందని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు అనిల్, ఆయూ బ్, తగరం శంకర్, సంతోష్, జావీద్ ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేసిన అధికారులు


ఓటు వినియోగించుకున్న అధికారులు

చెన్నూర్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని తహసీల్దార్ మల్లిఖార్జున్, డీటీ లక్ష్మీనారాయణతో పాటు కార్యాలయ సిబ్బంది వినియోగించుకున్నారు. కార్యక్రమంలో పలువురు కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

దళారులదే రాజ్యం!

- కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోతున్న నిల్వలు
- ధాన్యం తరలించేందుకు లారీల కొరత
- తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్‌కు అమ్ముకుంటున్న రైతులు
- మద్దతు ధర అందక నష్టపోతున్న వైనం


సారంగపల్లి కొనుగోలు కేంద్రం వద్ద ప్రైవేట్ లారీలో బస్తాలు నింపుతున్న హమాలీలు



“నా పేరు మారిశెట్టి సదానందం. మాది చిర్రకుంట గ్రామం. నేను మూడెకరాల భూమిలో వరిసాగు చేశాను. 86క్వింటళ్లా ధాన్యం దిగుబడి వచ్చింది. సారంగపల్లిలోని కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తరలించి సుమారు ఇరవై రోజులైంది. ఇంత వరకు లారీల సరఫరా సరిగ్గా లేక కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం ఉంది. కేంద్రం వద్ద రోజూ పడే ఇబ్బందులు, వాతావరణ ప్రభావాన్ని చూసి.. తక్కువ ధరకు అమ్ముకున్నదే నయం కాబట్టి క్వింటాలుకు రూ.2వేల చొప్పున ప్రైవేట్ వారికి అమ్ముకున్నా. దీంతో సుమారు రూ.20వేల వరకు నష్టపోవాల్సి వచ్చింది. ఇది ఒక్క సదానందం రైతుదే కాదు. మిగితా రైతుల పరిస్థితి కూడా ఇలానే ఉంది.”

మందమర్రిరూరల్: రైతులకు మద్దతు ధర ఇస్తూ మండలాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం నెలల తరబడి నిలువలు పేరుకుపోతున్నాయి. ఎప్పటికప్పుడు ధాన్యాన్ని లారీలలో తరలించాల్సి ఉండగా, లారీలు సమయానికి రాకపోవడంతో కొనుగోళ్లు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. లోడ్‌తో మిల్లుకు వెళ్లిన లారీలు తిరిగి రాకపోవడంతో దళారులను ఆశ్రయించక తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్నదాతల ఇబ్బందులను ఆసరాగా చేసుకొని దళారులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. మద్దతు ధర కంటే క్వింటాలుకు రూ.100, రూ.200 తక్కువ చెల్లిస్తూ ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వం మద్దతు లభిస్తుందనుకున్న రైతులకు నిరాశే మిగులుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రైవేట్ లారీలను ఆశ్రయించకుండా, తగినన్ని లారీలు కొనుగోలు కేంద్రాలకు సరఫరా అయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు. మందమర్రి మండలం సారంగపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే ప్రభుత్వ కాంటా ద్వారానే ధాన్యాన్ని తూకం వేసి ప్రైవేట్ లారీలో బస్తాలు నింపుతున్నారు. ప్రభుత్వ కాంటా ద్వారా తూకం వేసి ప్రైవేట్ వారికి అమ్మడం నిబంధనలకు విరుద్ధమని పలువురు విమర్శిస్తున్నారు.

తూకంలో జాప్యం-రైతులకు కష్టం

జన్నారం: ధాన్యం తూకం వేయడంలో నెలల తరబడి ఆలస్యం కావడంతో రైతులు కష్టాల పాలవుతున్నారు. జన్నారం మండలంలోని మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. నెలల తరబడి రైతులు ఎదురుచూస్తున్నా కొనుగోళ్లలో జాప్యం జరుగుతోంది. ఇంకా 20మందికి పైగా రైతులు వడ్లు తూకం వేసుకోవడానికి నిరీక్షిస్తున్నారు. మంగళవారం కురిసిన వర్షంతో ధాన్యం తడిసి ఇబ్బంది ఏర్పడిందని, మళ్లీ మొగులు వస్తుందని, పంట ఎక్కడ న ష్టం అవుతుందో అని రైతులు దుర్గం లక్ష్మణ్, లచ్చన్న, గంగన్నలు వాపోతున్నారు. దుర్గం లక్ష్మణ్‌కు చెందిన ధాన్యం కుప్ప పోసి నెల రోజులు దాటినా ఇంకా తూకం వేయడం లేదని ఆరోపిస్తున్నాడు. ఈ నెల 11లోగా వడ్లు కొనకపోతే ఓట్లు వేయమని రైతు గంగన్న చెప్పాడు. ఈ విషయంలో అధికారులు, నాయకులు దృష్టి సారించి వరిధాన్యం తూకం వేసేలా చూడాలని కోరుతున్నారు. ఈ విషయంపై పీఏసీఎస్ సీఈవో రాజన్నను 'సాక్షి' వివరణ కోరగా లారీల కొరత వల్ల తూకం వేయలేకపోతున్నామని, లారీలు కేటాయిస్తే తూకం ప్రారంభిస్తామని తెలిపారు.

ఘనంగా రెడ్‌క్రాస్ దినోత్సవం


రక్తదానం చేస్తున్న రెడ్‌క్రాస్‌సభ్యులు


వృద్ధాశ్రమంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

మంచిర్యాలటౌన్: ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని శ్రీశ్రీనగర్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పతాకావిష్కరణ చేసి, న్యూరోఫిజీషియన్ డాక్టర్ తిరుమల్‌రావు, గ్యాస్ట్రో డాక్టర్ శ్రీధర్‌లతో వైద్య శిబిరం నిర్వహించి, వృద్ధులకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు అందించారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద నిర్వహిస్తున్న చలివేంద్రంలో చంద్రమోహన్ పుచ్చకాయను పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెనరి డ్యూనేంట్ చిత్ర పటానికి బ్లడ్ బ్యాంకులో పూలమాలలు వేసి, తలసేమియా పిల్లలకు మిఠాయిలు పంచారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని నిర్వహించి 30 మంది రక్తదాతల నుంచి రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ మెంబర్ వి.మధుసూదన్ రెడ్డి, జిల్లా వైస్ చైర్మన్ బొప్పు సతీశ్, కార్యదర్శి మహేందర్, కోశాధికారి సత్యపాల్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు కిషన్, శ్రీనివాస్, సత్యనారాయణరావు, సత్యనారాయణ రెడ్డి, చంద్రమోహన్, సంతోశ్‌కుమార్, హరీశ్, ఆశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన


కూలీలతో మాట్లాడుతున్న ఏపీవో

చెన్నూర్‌రూరల్: మండలంలోని నాగాపూర్ సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఈజీఎస్ ఏపీవో గంగాభవాని పరిశీలించారు. కూలీల హాజరుశాతం, రిజిస్టర్‌ను పరిశీలించా రు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందునా కూలీలు త్వరగా పని ముగించుకొని ఇళ్లకు వెళ్లాలని సూచించారు.

రేవంత్ మాటలను ఇక ఎవరూ నమ్మరు

- మంచిర్యాల బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న దివాకర్‌రావు

దండేపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వ హామీల గురించి సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారాల్లో దేవుళ్ల మీద ఒట్లు వేస్తూ, ప్రమాణాలు చేస్తున్నా ప్రజలు నమ్మేస్థితిలో లేరని, లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలంతా బీఆర్ఎస్ వైపే ఉన్నారని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. దండేపల్లి మండలం కన్నెపల్లి, గూడెం, నంబాల, వెల్గనూర్, కాసిపేట గ్రామాల్లో పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వాడవాడలా తిరగడంతో పాటు, ఉపాధిహామీ పనిప్రదేశాలకు వెళ్లి కూలీలను కలిసి కారుగుర్తుకు ఓటెయ్యాలని కోరారు. అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం అని చెప్పారు. కాసిపేటకు చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల, గ్రామ కమిటీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోదీ పాలనలోనే దేశం అభివృద్ధి


లక్సెట్టిపేటలో ప్రచారం చేస్తున్న రఘునాథ్


చెన్నూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

చెన్నూర్‌రూరల్/జన్నారం/చెన్నూర్/లక్సెట్టిపేట: మోదీ పాలనలోనే దేశం అభివృద్ధి చెందడంతో పాటు ఎదురులేని శక్తిగా ఎదిగిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ పేర్కొన్నారు. లక్సెట్టిపేట మండలం సూరారంలో పాల్గొని ఆయన మాట్లాడారు. చెన్నూర్ పట్టణంలో, జన్నారం మండలం రోటిగూడలో, చెన్నూర్ మండలంలోని ఆస్నాద గ్రామంలో పెద్దపల్లి బీజేపీ పార్లమెంట్ సభ్యులు గోమాసే శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరుతూ బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను ఓటర్లకు అందజేస్తూ గోమాసే శ్రీనివాస్‌ను గెలిపించి నరేంద్ర మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని ప్రచారం సాగించారు. చె న్నూర్‌లో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివకృష్ణ ఆధ్వర్యంలో 30 మంది యువకులు, ఆస్నాదలో సుమారు 20మంది కార్యకర్తలు బీజేపీలో చేరారు. చెన్నూర్‌లో బీజేపీ పెద్దపల్లి కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, నియోజకవర్గ కన్వీనర్ దుర్గం అశోక్, పట్టణ అధ్యక్షుడు జాడి తిరుపతి, గర్రెపల్లి నర్సయ్య, కమ్మల శ్రీనివాస్, పాశం ఆశీశ్, వెంకటేశ్వర్, లక్ష్మీనారాయణ రెడ్డి పాల్గొనగా, చెన్నూర్ మండలం ఆస్నాదలో మండల అధ్యక్షుడు మోర్ల శంకర్, అసెంబ్లీ కన్వీనర్ అక్కల రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు రాపర్తి వెంకన్న పాల్గొన్నారు. జన్నారంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కొంతం శంకరయ్య, మండల అధ్యక్షుడు గుండవరపు మధుసూధన్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

'దేశం కోసం పని చేసే పార్టీ బీజేపీ'

బెల్లంపల్లి/వేమనపల్లి/నస్పూర్/జైపూర్: దేశ హితం కోసం పని చేసే ఏకైక రాజకీయ పార్టీ బీజేపీ అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ పేర్కొన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో దివంగత కాకా వెంకటస్వామి కుటుంబ పాలనను అంతం చేయాలని ఓటర్లను కోరారు. బెల్లంపల్లి మండలం ఆకెనపల్లిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. స్వప్రయోజనాల కోసం తప్పా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం లేదని, కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గడ్డం వంశీకృష్ణను చిత్తుగా ఓడించి, బీజేపీ నుంచి పోటీ చేస్తున్న గోమాసే శ్రీనివాస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తేనే దేశానికి మేలు జరుగుతుందన్నారు. వేమనపల్లి మండలం నీల్వాయిలో బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ ఉపాధిహామీ కూలీల పని స్థలాల వద్దకు వెళ్లి బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీజేపీ అభ్యర్థి గోమాసె శ్రీనివాస్‌కు తమ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు ప్రజారాజ్య సమితి వ్యవస్థాపక అభ్యర్థి చల్లూరి మహేశ్ తెలిపారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ప్రజారాజ్య సమితి తరపున పెద్దపల్లిలో పోటీ చేస్తున్న దుర్గం సంతోష్‌తో కలిసి మాట్లాడారు. నేతకాని సామాజిక వర్గం ఓట్లు చీలకూడదు అనే ఉద్దేశంతో తాము తమ పార్టీ తరపున ప్రచారం నిర్వహించడం లేదని, తమ మద్దతును సైతం గోమాసె శ్రీనివాస్‌కే తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. జైపూర్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు దూట రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్ అభ్యర్థి వంశీకి అవకాశం ఇవ్వండి


శ్రీరాంపూర్‌లో మాట్లాడుతున్న ప్రేంసాగర్‌రావు


ఎంపీపీని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వినోద్


కాజిపల్లిలో మాట్లాడుతున్న అశోక్‌యాదవ్

- జోరుగా కొనసాగుతున్న ఎన్నికల ప్రచారం

లక్సెట్టిపేట/భీమారం/దండేపల్లి/కోటపల్లి: లక్సెట్టిపేట మండలంలోని మోదెల, గంపలపల్లి గ్రామాల్లో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు బుధవారం ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, దేశం అభివృద్ధి చెందుతుందని ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చింత అశోక్, నాగభూషణం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. భీమారం మండలం కాజిపెల్లిలో తెలంగాణ గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము అశోక్‌యాదవ్ కాంగ్రెస్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు పెద్దల బాపు, దయ్యాల రాకేష్, గోదారి బానేష్ పాల్గొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని, నేతకాని మహార్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాడి నర్సయ్య తెలిపారు. పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణకు మద్దతుగా దండేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో సంఘ నాయకులు బుధవారం ప్రచారం నిర్వహించారు. వంశీకృష్ణ గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు శ్రమించాలని మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ అన్నారు. కోటపల్లి మండలంలోని రాపన్‌పల్లి, అర్జునగుట్ట, రాంపూర్, దేవులవాడ, బబ్బరుచెల్క గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వివిధ పార్టీల నాయకులను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ మూల రాజిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సమ్మయ్య, ఎంపీటీసీ జేక శేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు మహేశ్‌ప్రసాద్ తివారీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజమల్లగౌడ్, సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ద్వారానే ప్రజలకు మెరుగైన పాలన

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/జైపూర్/కాసిపేట/వేమనపల్లి/తాండూర్: పార్లమెంట్ ఎన్నికల్లో భారీ విజయం సాధించి కేంద్రంలో అధికారంలోకి వచ్చి సమస్త ప్రజానీకానికి మెరుగైన పాలన అందించేది కాంగ్రెస్ పార్టీ అని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అన్నారు. హాజీపూర్ మండలంలోని కర్ణమామిడి, వేంపల్లి, హాజీపూర్, ముల్కల్ల గ్రామాల్లో బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. జైపూర్ మండలంలోని ఇందారం, గంగిపల్లి, వెంకట్రావుపల్లి, దుబ్బపల్లితో పాటు పలు గ్రామాల్లో వంశీకృష్ణను గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు అభ్యర్థించారు. కాసిపేట ఎంపీపీ రొడ్డ లక్ష్మీ బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వేమనపల్లి మండలంతో పాటు నాగారాం గ్రామాల్లో ఎంపీటీసీ సంతోష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాబీర్‌ఆలీతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తాండూర్ ప్రెస్‌క్లబ్‌లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు తుంగపిండి రాజేష్‌కుమార్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కె.రవీందర్, మండల అధ్యక్షుడు మహంకాళి రంగయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేశం మాట్లాడారు. కుల, మతాల మధ్య చిచ్చుపెడుతున్న బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీని ఎన్నికల్లో ఆదరించి, బీజేపీకి బుద్ధి చెప్పాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపించాలి

శ్రీరాంపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు కోరారు. నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 3, 4, 5, 6, 9, 16, 17 వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రత్యేక సభలు నిర్వహించి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, పట్టణ అధ్యక్షుడు బండారి సుధాకర్, సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి రామగుడు లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ గెలిస్తే రాజ్యాంగ ఉనికికే ప్రమాదం

తాండూర్: కేంద్రంలో భారతీయ జనతాపార్టీ(బీజేపీ) మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగ ఉనికికే ప్రమాదంగా ఉంటుందని సీపీఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ అన్నారు. తాండూర్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మూడోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని మోదీ బాహాటంగానే ప్రకటించారని గుర్తు చేశారు. ఆ తీరుగా జరిగితే పేదలు, అట్టడుగు వర్గాలకు తీరని నష్టం కలుగుతుందన్నారు. బీజేపీ గెలవకుండా ప్రతిఒక్కరూ ఇండియా కూటమిని ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా మోదీ పాలనలో ప్రజాస్వామ్య విధ్వంసం అనే పుస్తకాన్ని విడుదల చేశారు.

స్వేచ్ఛగా ఓటును వినియోగించుకోవాలి


శ్రీరాంపూర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్సై


ఇందారంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు


గ్రామస్తులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ సుధాకర్

శ్రీరాంపూర్: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని మంచిర్యాల రూరల్ సీఐ అశోక్ తెలిపారు. సీపీ, డీసీపీ, ఏసీపీల ఆదేశాల మేరకు బుధవారం సీసీసీలో కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సీసీసీ కార్నర్ నుంచి కార్మికవాడల మీదుగా ఈ ఫ్లాగ్‌మార్చ్ జరిగింది. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రజలంతా సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు. శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తరోడ్‌లో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సంతోశ్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులకు సహకరించాలన్నారు. కాలనీల్లో తిరుగుతూ అనుమానితులను ప్రశ్నించారు.

జైపూర్: మండల కేంద్రంతో పాటు ఇందారంలో ఓటు హక్కుపై ఉపాధిహామీ కూలీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో కిషన్, ఎంపీడీవో సత్యనారాయణ ఓటు హక్కు దాని ప్రాముఖ్యతను కళాజాత బృందంతో వివరించారు. కార్యక్రమంలో జేడీఎం రాంచందర్, ఏపీవో వెంకటేశ్వర్లు, ఈసీ రాజమౌళి, పంచాయతీ, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఓటు వేయాలి

వేమనపల్లి: ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోవాలని చెన్నూర్‌రూరల్ సీఐ సుధాకర్ అన్నారు. మండల కేంద్రంతో పాటు నీల్వాయిలో బుధవారం పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలు ఎన్నికల సిబ్బందికి, పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్యాంపటేల్, సీఆర్పీఎఫ్, పోలీసులు పాల్గొన్నారు.

నాంచారమ్మ జాతర విజయవంతం చేయండి

మందమర్రిరూరల్: ఈ నెల 23న ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం రామానుజాపురంలో నిర్వహించే నాంచారమ్మ జాతరను ఎరుకల కుల బాంధవులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు దుగ్యాల బాపు పిలుపునిచ్చారు. స్థానిక పాలచెట్టు సమీపంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ జాతరకు ప్రభుత్వం తగినన్ని నిధులు కేటాయించి అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లోకిని రవి, కోశాధికారి సార్ల సంపత్, నాయకులు రాయమల్లు, సంజీవ్, సంపత్ ఉన్నారు.

వినతిపత్రం అందజేత

తాండూర్: ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు హిందూ దేవుళ్లను కించపరిచేలా మాట్లాడుతున్నారని విశ్వహిందూ పరిషత్ నాయకులు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు.